కుళ్లిన ఆహారం.. జరభద్రం

- రెస్టారెంట్లు, హోటళ్లలో నిల్వచేసిన పదార్థాలు
- ఎల్‌బీనగర్‌లో కానరాని తనిఖీలు
- రోగాల బారిన ప్రజలు


ఇటీవల ఓ హోటల్‌లో తనిఖీ చేస్తున్న దృశ్యం

ఎల్‌బీనగర్: ఆరోగ్యమే మహాభాగ్యం అంటున్న ప్రజలు ప్రస్తుతం కల్తీ, కుళ్లిన ఆహార పదార్థాలు తిని అనారోగ్యాలకు గురవుతున్నారు. పేరుగాంచిన రెస్టారెంట్లలో నిల్వ చేసిన మాంసం, ఇతర పదార్థాలను తాజావంటూ భోజనం చేసేందుకు వచ్చిన వారి వడ్డించి రోగాలను అంటగడుతున్నారు. ఎల్‌బీనగర్‌లో పలు రెస్టారెంట్లు పేరెన్నికగా ఉన్న అందులో తినే భోజనం మాత్రం ప్రాణాలకు హాని తెచ్చిపెడుతోంది. ఎల్‌బీనగర్‌లో పలు రెస్టారెంట్లలో ఇటీవల ఫుడ్ అధికారులు తనిఖీలు చేయగా అక్కడి పరిస్థితులు చూసి కంగుతున్నారు. కిచెన్‌లలో పరిశుభ్రత లేకపోవడం రోజుల తరబడి ఆహార పదార్థాలను ఫ్రిడ్జ్‌లలో నిల్వ చేస్తున్నట్లు గుర్తించారు. అసలే రోగాల కాలం ఈ నేపథ్యంలో ఇలాంటి ఆహార పదార్థాలు తింటే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కేవలం లాభార్జనే ధ్యేయంగా ఆయా రెస్టారెంట్లు, హోటళ్ల నిర్వాహకులు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పేరుగాంచిన హోటళ్లలోనూ..

ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల పరిధిలో సుమారుగా 200లకు పైగా హోటళ్లు ఉన్నాయి. పేరుకే పెద్ద హోటళ్లు ధరలు కూడా అదే తీరులో ఉంటాయి. కానీ.. ఫుడ్ విషయానికి వస్తే అంతా కల్తీ ఆహారమే. ఇందులో తింటే రోగాల బారిన పడి ఆస్పత్రులకు పరిగులు తీయాల్సిందేనని పలువురు ఆందోళన చెందుతున్నారు. చాల రెస్టారెంట్ల నిర్వాహకులు నిల్వచేసిన ఆహారాన్నే మళ్లీ వండి వడ్డిస్తున్నారు. ఫ్రిడ్జ్‌లలో రోజుల తరబడి నిల్వ ఉంచిన చికెన్, మటన్, రసాయనాలతో కూడిన ఫుడ్‌ను కస్టమర్లకు వడ్డిస్తున్నట్లు సమాచారం. ఫ్రిడ్జ్‌లలో నిల్వ చేస్తున్న ఆహార పదార్థాలపై కూడా రసాయనాలు వాడుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అపరిశుభ్రంగా వంటగదులు

ఎల్‌బీనగర్‌లో పలు రెస్టారెంట్లు, బార్ల కిచెన్లలో అపరిశుభ్ర వాతావరణంలో ఉంది. అక్కడే వంట చేయడం పాత్రలు సైతం శుభ్రం చేయకపోవడం పక్కనే మురుగునీరు పారుతుండడం జరుగుతుంది. దీంతో భరించలేని దుర్వాసన వస్తోంది. గడువు ముగిసిన అహార పదార్థాలు, కిచెన్ పరిశుభ్రత, నిల్వ ఉంచిన మాంస, కూరగాయలు వడ్డిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా ఇటీవల పలు హోటళ్లలోని భోజనంలో బొద్దింకలు వచ్చిన ఘటనలు ఉన్నాయి. ఫుడ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే దీనికి ప్రధాన కారణమని నిత్యం తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కేసులు నమోదు చేస్తాం

రోజు వారీగా ఆయా సర్కిళ్లలో హోటళ్లను తనిఖీ చేస్తున్నాం. జీహెచ్‌ఎంసీ యాప్‌ద్వారా వచ్చే ఫిర్యాదులతో పాటు నేరుగా వెళ్లి హోటళ్లలో తనిఖీ చేసి ఫుడ్ శాంపిళ్లను ల్యాబ్‌కు పంపిస్తున్నాం. కల్తీ, కుళ్లినట్లు నిర్ధారణ అయితే వారిపై కేసులు నమోదు చేస్తాం. ఇప్పటి వరకు నాలుగు కేసులు నమోదు చేశాం

–సన్నీ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్

కీమోథెరపీ యూనిట్ ప్రారంభం


కీమోథెరపీ యూనిట్ ప్రారంభోత్సవంలో వైద్యులు

వనస్థలిపురం: రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా మంగళవారం వర్చువల్‌గా అన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో డేకేర్ కీమోథెరపీ యూనిట్లను ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా పరిధి వనస్థలిపురంలోని మహేశ్వరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రిలో సూపరింటిండెంట్లు డా.నాగేందర్, డా.కృష్ణ పది పడకల కీమోథెరపీ, అదనంగా పది పడకల పాలియేటివ్ కేర్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్యాన్సర్ బాధితులు మొదట నగరంలోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించుకుని చికిత్స తర్వాత, రెండవసారి నుంచి స్థానికంగా ఉన్న ఆసుపత్రులలో కీమోథెరపీ సేవలు పొందవచ్చన్నారు. రంగారెడ్డి జిల్లాకు సంబంధించి 266 మంది క్యాన్సర్ రోగులను వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి అలాట్‌మెంట్ చేయడం జరిగిందని అలాగే పక్షవాతం రోగులకు పాలియేటివ్ కేర్ సెంటర్‌లో చికిత్స నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డా.జయమాల, డా.రాజ్‌కుమార్, జనరల్ సర్జరీ, అనస్థీషియా, మెడికల్, నర్సింగ్ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేసిన నూతన కార్యవర్గం

మన్సూరాబాద్: పద్మశాలి సంఘం ఎల్‌బీనగర్ సర్కిల్ మహిళా విభాగం నూతన కార్యవర్గం సంఘం అధ్యక్షుడు పున్న గణేష్‌నేత అధ్యక్షతన మన్సూరాబాద్‌లోని పాలాది పరమేశ్వర్ వృద్ధాశ్రమంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు గుంటక రూపా సదాశివ్, గ్రేటర్ హైదరాబాద్ సంఘం అధ్యక్షురాలు పోరండ్ల శారద హాజరై నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావటమే కాకుండా రాజకీయంగా ఎదుగేందుకు కృషి చేయాలన్నారు. ఎల్‌బీనగర్ సర్కిల్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా రమాదేవి, గౌరవ అధ్యక్షురాలిగా భారతమ్మ, గౌరవ సలహాదారులుగా ఉమా శ్రీనివాస్, రావిరాల సంధ్యారాణి, వర్ణలీల, ఉపాధ్యక్షురాలిగా సంతోషి, ప్రధాన కార్యదర్శిగా సుజాత, కోశాధికారిగా పూర్ణిమ ప్రమాణ స్వీకారం చేశారు.

స్వచ్ఛ రిక్షాల అందజేత


రిక్షాలను అందజేస్తున్న కార్పొరేటర్

మన్సూరాబాద్: ప్రజారోగ్యమే ధ్యేయంగా పరిసరాల పరిశుభ్రతకు చెత్త రిక్షాలను అందజేస్తున్నామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ పరిధి కాస్మోపాలిటన్‌కాలనీలో మంగళవారం జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బందికి చెత్త రిక్షాలను అందజేసి మాట్లాడారు. స్వచ్ఛ భారత్–స్వచ్ఛ హైదారబాద్ లక్ష్యాన్ని నెరవేర్చే క్రమంలో సిబ్బందికి అవసరమైన పరికరాలు, వనరులు అందించాలన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మన్సూరాబాద్: వచ్చేనెల 12న పద్మశాలి దసరా మేళాను ఘనంగా నిర్వహిస్తున్నట్లు అఖిల భారత పద్మశాలి అన్నసత్రాల మార్గదర్శకులు చిలువేరు కాశీనాథ్ అన్నారు. పద్మశాలి దసరా మేళాపోస్టర్‌ను ఆయన మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. 22 ఏళ్లుగా పద్మశాలి దసరా మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. త్వరలో కొత్తపేటలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పున్న గణేష్‌నేత, రవితేజ, గుజ్జసత్యం, సంధ్యారాణి, శ్రావణ్, అంజయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

నిమజ్జన వ్యర్థాల తొలగింపు


వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

మన్సూరాబాద్: మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలోని నిమజ్జన కొలనులోని వ్యర్థాలను తొలగిస్తున్నారు. ఆదివారం తెల్లవారు జాము వరకు గణనాథుల నిమజ్జనం కొనసాగడంతో రెండు రోజుల అనంతరం గణనాథులను తొలగించి కొలనును శుభ్రం చేస్తున్నారు. రానున్న బతుకమ్మ ఉత్సవాలకు కొలనును సిద్ధం చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

సన్మానం



చంచల్‌గూడ: తెలంగాణ బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా క్రాంతి కిరణ్ నియామకమయ్యారు. మంగళవారం కుర్మగూడ డివిజన్‌కు చెందిన మోహన్‌కృష్ణ, గౌతమ్, నాగరాజు, అజయ్, ప్రదీప్, ప్రేమ్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

అన్నదానం


అన్నదానం ప్రారంభిస్తున్న గోవర్ధన్ రెడ్డి

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గం సీనియర్ నేత బొక్క గోవర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం మూసారంబాగ్‌లో ఘనంగా నిర్వహించారు. పలువురు నాయకులు ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అన్నదానం కార్యక్రమం చేపట్టారు. విశాల్, శ్రీకాంత్ యాదవ్, రాఘవేంద్ర, హరీష్, నూతన్, నరేష్, సోను యాదవ్, కిరణ్, పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం


అనిత

నాగోలు: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ..కుంట్లూర్, రాజీవ్ గృహ కల్పలో ఉండే పబ్బతి అనిత(25) కూరగాయల వ్యాపారం చేస్తోంది. ఈ నెల 5న రాత్రి 9 గంటలకు తండ్రితో గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతకీ రాలేదు. ఆందళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసుకు ఫిర్యాదు చేశారు.


శివబాలాజీ

- బండ్లగూడ కృషినగర్‌లో నివాసముండూ చుంచు శివ బాలాజీ(18) ఈ నెల 8న ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. స్నేహితులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి


అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల ఆదేశించారు. మంగళవారం ఆయన పంజేషాలోని క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులతో అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించి డివిజన్ల వారీగా పెండింగ్ పనులపై చర్చించారు. ప్రజలకు మెరుగైన వసతుల కల్పన కోసం అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనుల్లో జాప్యం లేకుండా వేగవంతం పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు సయ్యద్ మినాజుద్దీన్, సలామ్ షాహిద్, ఈఈ కవిత, డీఈఈ ప్రజ్ఞారెడ్డి, ఏఈలు వెంకన్న, శరత్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టీటీఐ సిబ్బంది

నాగోలు: విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను గుర్తుంచుకోవాలని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) సీఐ రాచపుడి అన్నారు. మంగళవారం ఎల్‌బీనగర్‌లోని శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులకు ఎల్‌బీనగర్ ట్రాఫిక్ చిల్డ్రన్ పార్క్‌లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. తెలుగు, ఇంగ్లిష్ సూచనలతో రూపొందించిన ఏబీసీ ఆఫ్ రోడ్ సేఫ్టీ ఫర్ చిల్డ్రన్ బుక్‌లెట్స్ పంపిణీ చేశారు. వివిధ చౌరస్తాల్లో రోడ్డుదాటే సమాయంలో వాహనదారులు పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ట్రాఫిక్ సిగ్నల్స్ వద్దనే రోడ్డు దాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నర్సింహారావు, సిబ్బంది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కుళ్లిన పులిహోర ప్రసాదం కలకలం


కుళ్లిన పులిహోర ప్రసాదం

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ప్రసిద్ధిచెందిన ధ్యానాంజనేయ స్వామివారి ఆలయంలో వీఐపీ భక్తులకు అందించే కుళ్లిన పులిహోర ప్రసాదం కలకలం రేపింది. మంగళవారం స్థానిక భక్తుడు స్వామివారిని దర్శించుకుని పూజారులు అందించిన వీఐపీ ప్రసాదాన్ని తీసుకున్నాడు. ఆతను పులిహోర పాకెట్‌ను విప్పిన వెంటనే కుళ్లిన వాసన రావడంతో ఆ విషయాన్ని ఆలయ పాలక మండలి సభ్యుల దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందిని ఆరా తీశారు. ఈ క్రమంలో ఇరువురి నడుమ మధ్య స్వల్ప వాగ్వాదం చోటుకొంది. ఈ విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో కలకలం రేపింది. ఈ విషయమై ఈఓ లావణ్యను వివరణ కోరగా తాను సెలవులో ఉన్నానని కుళ్లిన ప్రసాద విషయమై ఆలయ అధికారుల దృష్టికి తీసుకుని రాలేదని ఆ ప్రసాదాన్ని తమకు అందచేసినట్లెతై ఫుడ్‌సేఫ్టీ అధికారులకు పంపించే వారమన్నారు. తాము ప్రసాదాన్ని ఏ రోజుకు ఆరోజే పంపిణీ చేస్తామన్నారు. తాను విధులలోకి చేరిన వెంటనే పూర్తిస్థాయి విచారణ చేసి బాధులపై చర్యలు తీసుకుంటానన్నారు.

ప్రమాదకర మ్యాన్‌హోళ్లపై రెడ్ పెయింట్

డీజీఎం హస్మత్ అలీ

చాదర్‌ఘాట్: ప్రమాదకర మ్యాన్‌హోళ్లను ప్రజలు సులువుగా గుర్తించేందుకు వాటి మూతలపై ఎరుపు రంగు ఉంటుందని మలక్‌పేట జలమండలి డీజీఎం హస్మత్‌అలీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ మ్యాన్‌హోల్ మూతలపై ఎరుపు రంగు ఉంటుందో అది లోతైనదని గుర్తించుకోవాలన్నారు. మలక్‌పేట డివిజన్–1లో వరద వెళ్లే మార్గాలు, నిలిచే ప్రాంతాలు 20 ఉన్నాయని వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద ఉన్న మ్యాన్‌హోళ్లు, ఆరడుగుల లోతు కన్నా తక్కువగా ఉన్నా వాటికి కూడా సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి డివిజన్‌కు ఒక టీమ్‌ను ఏర్పాటు చేశామని మలక్‌పేటలో ముంపు ప్రాంతాలలో 829 లోతైన మ్యాన్‌హోళ్లను గుర్తించామన్నారు. ఎక్కడైనా వరద సమస్య తలెత్తితే 155313 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

పోలీస్ సిబ్బందికి సన్మానం


బాలాపూర్ పోలీసు సిబ్బందిని సన్మానిస్తున్న గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు

బడంగ్‌పేట్: బాలాపూర్ గణేశ్ ఉత్సవాల్లో ప్రతిష్ట బందోబస్త్ నిర్వహించి శాంతియుతంగా శోభాయాత్ర పూర్తి చేసేందుకు సహకారం అందించిన పోలీసు సిబ్బందిని మంగళవారం ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి, నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. గణేశ్ ఉత్సవ సమితి తరఫున ఏసీపీ జానకీరెడ్డి, డీసీపీ సత్యనారాయణ, బాలాపూర్ సీఐ సుధాకర్, ఎస్ఐ సుధాకర్, ప్రసాద్, కోటేశ్వర్‌రావు, సోహెల్‌తో పాటు బాలాపూర్ పోలీసులు, పహడిషరీఫ్ పోలీస్ సిబ్బందిని శాలువాల తో సన్మానించి గణనాథుని లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికుల జీతాలలో భారీకోత

వనస్థలిపురం: వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో కాంట్రాక్టు కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. వారికి రావాల్సిన జీతంలో సదరు ఏజెన్సీ కోత విధిస్తుండడంతో చాలీచాలని జీతాలతో అవస్థలు పడుతున్నారు. వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో టీవీటీ గ్రూప్ స్ప్రెడింగ్ ఇంటిగ్రిటీ సంస్థ ఆధ్వర్యంలో సెక్యూరిటీ, ఆయాలు, వార్డ్ బాయ్‌లు మొత్తం 58 మంది కాంట్రాక్ట్ లేబర్‌గా పనిచేస్తున్నారు. రికార్డుల ప్రకారం వారికి నెలకు రూ. 15,600 జీతం ఇస్తున్నట్లుగా చూపించి వారికి కేవలం నెలకు రూ. 10 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. అయితే పీఎఫ్ కింద రూ. 500 మాత్రమే జమ చేస్తూ మిగతావి సదరు సంస్థ నొక్కేస్తుందని సిబ్బంది వాపోతున్నారు. ఈ విషయమై గత ఐదేళ్లుగా యూనియన్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేదని కార్మికులు వాపోతున్నారు. జీతాలలో కోత విషయమై కాంట్రాక్ట్ కార్మికులు తమకు పలు మార్లు ఫిర్యాదు చేసిన మాట నిజమే. ఆ విషయం మా చేతుల్లో లేదని సూపరింటెండెంట్ కృష్ణ తెలిపారు.

నీటిబిల్లు రద్దు చేయాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

ఎల్‌బీనగర్: నూతన భవనాలకు అధికంగా నీటి బిల్లులను వేస్తు ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు కీసరి నర్సిరెడ్డి అన్నారు.హయత్‌నగర్ శ్రీనివాస్ కాలనీలో నూతన భవనాలకు రూ. 600 నుంచి రూ.2 వేల వరకు నీటి బిల్లులు వేస్తున్నరని వాటిని వెంటనే అరికట్టాలని మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో జలమండలి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. నీటి బిల్లులతో వినియోగదారులపై అధికభారం పడుతుందని, మీటర్లను సరిచేసి తక్కువ బిల్లులను వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, నరహరి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 19వ డివిజన్ గాయత్రీహిల్స్ కాలనీలో మంగళవారం సీసీరోడ్డు నిర్మాణ పనులను నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి విచ్చేసి పనులను పరిశీలించారు. నాణ్యతతో పనులు పూర్తిచేసి కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకురావాలని గుత్తేదారును ఆయన కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్ రెడ్డి, జెల్ల రమేశ్‌గౌడ్, గిరిముదిరాజ్, ఇక్కె శ్రీనివాస్, కాలనీవాసులు ఉన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించాలి


మహేష్‌కుమార్ గౌడ్‌ను సన్మానించిన కోట్ల శ్రీనివాస్

సైదాబాద్: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు సక్రమంగా అందేలా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ సూచించారు. టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి ఏడాది కాలం పూర్తి చేసుకున్న ఆయనను హైదరాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్ మంగళవారం యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి సన్మానించారు. రాష్ట్రంలో అన్నివర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేపట్టిన పథకాలను పార్టీ నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించనట్లు కోట్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లడ్డూపటేల్, హరి పటేల్, తదితరులు పాల్గొన్నారు.

వెలిగిన స్ట్రీట్‌లైట్లు

సాక్షి ఎఫెక్ట్..

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ సలీంనగర్ గణేష్ టెంపుల్ వెనుకలైన్‌లో స్ట్రీట్ లైట్లు వెలగకపోవడంతో అంధకారం నెలకొంది.ఈ సమస్యపై ఈ నెల 6న సాక్షిలో 'వెలగని స్ట్రీట్ లైట్లు' అనే శీర్షిక ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం వెలగని స్ట్రీట్‌లైట్లను గుర్తించి మరమ్మతు చేశారు. లైట్ల చుట్టూ అల్లుకుపోయిన చెట్ల తీగలను తొలగించారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన సాక్షికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.


సలీంనగర్‌లో స్ట్రీట్‌లైట్లకు మరమ్మతు చేస్తున్న దృశ్యం

భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు


చదును పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆలయ చైర్మన్ నరేశ్‌గౌడ్, నాయకులు

పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని ప్రాచీనమైన శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని పాలక మండలి చైర్మన్ కల్లెం నరేశ్‌గౌడ్ అన్నారు. ఈ నెల 22వ తేదీ నుంచి ఆరురోజుల పాటు జరుగనున్న ఉత్సవాల దృష్ట్యా ఆలయ పరిసరాలలో చదును పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనుల పండువగా జరిగే ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు పార్కింగ్ సదుపాయం కోసం ఆలయ పరిసరాలను జేసీబీ, డోజర్‌తో చదును చేయిస్తున్నామన్నారు. ఆలయం ఎదుట ఉన్న కొబ్బరి చెట్ల కొమ్మలను కూడా తొలగిస్తున్నామన్నారు. కమిటీ డైరెక్టర్లు చీమలదరి చెన్నయ్య, గొండ్యాల శేఖర్‌ముదిరాజ్, కానుగుల భాస్కర్, గుర్జని రాధిక, ఏ.అనిత, భక్తులందరి సహకారంతో ఈ సారి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లాల్ సతీష్‌గౌడ్, లాల్ విజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులమంటూ అక్రమ వసూళ్లు

ఇద్దరి రిమాండ్, పరారీలో మరొకరు



నాగోలు: రెవెన్యూ అధికారులమంటూ డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరిని నాగోలు పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సీఐ మాక్బుల్ జానీ వివరాల ప్రకారం..దిల్‌సుఖ్‌నగర్ గడ్డిఅన్నారం ప్రాంతానికి చెందిన రాచకొండ సతీష్, గడ్డిఅన్నారంకు చెందిన శ్యామకూరి శివగౌడ్, అలియాస్ శివ, మరో వ్యక్తి దామెర నాగఫణీంద్ర, అలియాస్ ఫణీ ఓ చానల్, పత్రికలో రిపోర్టర్లుగా పనిచేస్తున్నాడు. ఎల్‌బీనగర్, నాగోలు, బండ్లగూడ ఇతర ప్రాంతాల్లో బోర్లు వేస్తున్న వ్యక్తులను తాము రెవెన్యూ శాఖ అధికారులమని నమ్మిస్తూ బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారు. బాధితులను బెదిరించి రూ. 20 వేల నుంచి 30 వేలకు వరకు డబ్బులు వసూలు చేస్తున్నారు. ఏప్రిల్ 19న ఫతుల్లాగూడ ధనలక్ష్మి కాలనీలో పవన్ అనే వ్యక్తి తన ప్లాట్‌లో బోరు వేయిస్తుండగా అతడిని బెదిరించి రూ. 20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చివరికి రూ.12 వేలు గూగుల్ పే ద్వారా శివఅకౌంట్‌కు చెల్లించారు. అనంతరం ముగ్గురు కలిసి పంచుకున్నారు.బాధితుడు ఈ విషయాన్ని ఉప్పల్ తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా నాగోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మంగళవారం సతీష్, శివకుమార్‌ను రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరో నిందితుడు దామోద నాగ ఫణీంద్ర పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు

టమాటా రూ.23, వంకాయ రూ.28, బెండ రూ.37, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.32, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.43, దొండ రూ.40, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.22, గోకరకాయ రూ.45, దోసకాయ రూ.18, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.23, మునగ రూ.45, కందగడ్డ రూ.40, బీట్‌రూట్ రూ.25, కీర రూ.18, బీన్స్ రూ.40, క్యాప్సికమ్ రూ.53. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.